సాక్షి కామారెడ్డి

శుక్రవారం : 29 : ఆగస్టు : 2025



తప్పిన ముప్పు

పోచారం ప్రాజెక్టుకు భారీ ఇన్‌ఫ్లో రావడం తో నీటిప్రవాహ తాకిడికి అలుగుకు ఒకవైపు మట్టి కొట్టుకుపోయి కట్ట కోతకు గురైంది.

- 8లో ▸



సహాయక చర్యలు భేష్

అధికారులు సమన్వయంతో పనిచేసి ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించగలిగారని మంత్రి సీతక్క అభినందించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.4 /19.2

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్త రునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.



రామారెడ్డి రోడ్‌లోని శ్రీకాలనీలో మునిగిన కార్లు



సరంపల్లి ఎస్టీ హాస్టల్‌లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు, రెస్క్యూ టీం



జీఆర్ కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు, రెస్క్యూటీం బృందం

ఉరిమిన మేఘం



నెమ్లిలో జలమయం అయిన పొలాలు

- జిల్లాలో కుంభవృష్టి.. అతలాకుతలమైన జనజీవనం
- ఉధృతంగా ప్రవహించిన వాగులు..
- వరదలతో ఇద్దరు మృతి, మరొకరి గల్లంతు
- 93,925 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- విద్యాసంస్థలకు మరో రెండు రోజులు సెలవు ప్రకటించిన విద్యాశాఖ

జిల్లాలో వరుణుడు విలయ తాండవం చేశాడు. కుంభవృష్టి కురిపించడంతో వాగులు ఉప్పొంగాయి. ఎటు చూసినా వరద నీరే కనిపించింది. కాలనీలు చెరువులు, కుంటలను తలపించాయి. దీంతో జనజీవనం అతలాకుతలమైంది. వర్షాలతో ఇద్దరు మృత్యువాతపడగా.. వాగులో గల్లంతయిన మరొకరి ఆచూకీ లభించలేదు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలతో వాగులు పోటెత్తాయి. రెండు రోజుల పాటు దంచికొట్టిన వానతో జనజీవనం స్తంభించిపోయింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజంపేటలో ప్రహరీ కూలి మీద పడడంతో డాక్టర్ వినయ్ మృతిచెందాడు. దోమకొండ మండలంలో ఎడ్లకట్ట వాగులో కొట్టుకుపోయినవారిలో ఇద్దరు సురక్షితంగా ఇళ్లకు చేరగా.. బాల్‌రాజ్ అనే వ్యక్తి ఆచూకీ లభించలేదు. బీబీపేట మండలం జనగామలో ఎడ్లకట్ల వాగులో చిక్కుకుని రాజిరెడ్డి అనే రైతు మరణించాడు.

135 శాతం అధికంగా నమోదు..

జిల్లాలో ఆగస్టులో సాధారణ వర్షపాతం 224.4 మి.మీ. కాగా 529.0 మి.మీ. వర్షం కురిసింది. 135 శాతం అదనంగా వర్షం పడింది. రాజంపేట, నాగిరెడ్డిపేట, భిక్కనూరు, ఎల్లారెడ్డి, లింగంపేట, కామారెడ్డి, దోమకొండ, నిజాంసాగర్, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివనగర్, పాల్వంచ, మాచారెడ్డి, పిట్లం, బీబీపేట, మహ్మద్‌నగర్, గాంధారి మండలాల్లో రెండు రోజుల్లో 30 నుంచి 60 సెం.మీ. దాకా వర్షం కురిసింది. రాజంపేటలో ఒక్కరోజే రికార్డు స్థాయిలో 494 మి.మీ. వానపడింది. జిల్లాకేంద్రంలో పలువురి వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు రెస్క్యూ బృందాలు కృషి చేశాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు.



కామారెడ్డిలో ధ్వంసమైన హైవే



సోమారంతండాలో ఇంట్లోకి చేరిన నీరు

ఆశలను చిదిమేసింది..

జిల్లాలో వాగులు పొంగి ప్రవహించడంతో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. 55 చెరువులు తెగిపోగా ఏడింటికి మరమ్మతులు చేశారు. 380 గ్రామాలలో 93,925 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి పంట చాలా చోట్ల కొట్టుకుపోయింది. పత్తి, సోయా, మక్క పంటల్లో నీరు నిలవడంతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. జిల్లాలో 18 గేదెలు, 8 ఆవులు, పదివేల కోళ్లు చనిపోయాయని అధికారులు తెలిపారు.

కూలిన ఇళ్లు..

జిల్లాలో 13 ఇళ్లు పూర్తిగా కూలగా, 310 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. ఇళ్లు కూలిపోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని హౌజింగ్ బోర్డు, జీఆర్ కాలనీలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంజీర నది వెంట ఉన్న గ్రామాల్లో కూడా ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



దేమికలాన్ శివారులో ఒరిగిన మక్క పంట

దెబ్బతిన్న రోడ్లు..

పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన 24 రోడ్లు, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన 34 రోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రధానంగా 44 వ నంబరు జాతీయ రహదారిపై పలు చోట్ల వరద పోటెత్తడంతో రోడ్డు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్, ఆదిలాబాద్ వెళ్లాల్సిన వాహనాలు చాలాచోట్ల గంటల తరబడి ఆగిపోవాల్సి వచ్చింది. పోచారం ప్రాజెక్టు అలుగు పైనుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో కామారెడ్డి- మెదక్ జిల్లాల మధ్యనున్న వంతెన ముంపునకు గురైంది. వంతెనకు ఇరువైపులా రోడ్డు కోతకు గురై హైవేపై రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటితో గోపాల్‌పేట-ఎల్లారెడ్డి మధ్య రాకపోకలు స్తంభించాయి. తెగిన చోట మరమ్మతులు చేయించి ట్రాఫిక్ క్లియర్ చేయడానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర రాత్రంతా పర్యవేక్షించారు. రామేశ్వర్‌పల్లి శివారులో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో రైళ్లను మళ్లించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

భారీ వర్షాలతో స్తంభా లు విరిగిపడడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో 35 చోట్ల విద్యు త్తు సమస్యలు తలెత్తాయి. విద్యు త్ అధికారులు వేగంగా మరమ్మతు లు చేసి 23 చోట్ల పునరుద్ధరించారు. 12 చోట్ల ఇంకా విద్యుత్ మరమ్మతులు కొనసాగుతున్నాయి.

వర్షాల నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం మరో రెండు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు డీఈవో తెలిపారు.

బీబీపేట పెద్ద చెరువు పరిశీలన..

బుంగపడ్డ బీబీపేట పెద్ద చెరువును రాత్రి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు పరిశీలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో దిగువన ఉన్న షేర్ బీబీపేట గ్రామస్తులను ఖాళీ చేయించారు. వారిని సమీపంలోని తుజాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన షెల్టర్‌కు తరలించారు.



జీఆర్ కాలనీలో ఇంట్లోకి చేరిన బురదను తొలగిస్తున్న కాలనీవాసి

వర్షపు నీటిని వేడి చేసుకుని..

జిల్లా కేంద్రంలో వర్షంతో కరెంటు కూడా లేకపోవడంతో ప్యూరిఫైడ్ వాటర్ సమస్య ఏర్పడింది. దీంతో చాలామంది వర్షపు నీటిని బిందెల్లో నింపుకుని, కాచి చల్లార్చుకుని తాగారు. రెండు రోజుల పాటు వర్షం దంచికొట్టడంతో వాటర్ ప్యూరిఫయర్‌లు పనిచేయలేదు. దీనికి తోడు రోడ్లు కూడా దెబ్బతినడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో చాలా ఇళ్లలో వర్షపు నీటిని వేడి చేసుకుని తాగారు.

వందలాది మందిని కాపాడిన రెస్క్యూ టీం

కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలోనుంచి 198 మందిని, హౌజింగ్ బోర్డు కాలనీ నుంచి 60 మందిని బయటకు తీసుకువచ్చారు. ఎస్టీ గురుకులం చుట్టూ నీరు చేరడంతో 300 మంది విద్యార్థులు బయటకు తెచ్చారు. రాజంపేట మడలంలోని పలు గ్రామాల్లో జలదిగ్బంధంనుంచి 29 మందిని కాపాడారు. కామారెడ్డి టీచర్స్ కాలనీలో ఒకరిని, తిమ్మారెడ్డి గ్రామంలో ముగ్గురిని, పాల్వంచలో ఇద్దరిని, గోపాల్‌పల్లిలో ఒకరిని కాపాడారు. మారంపల్లిలో వంద మందిని, ఉగ్రవాయి వద్ద 50 మందిని, నర్వ వద్ద 9 మందిని రెస్క్యూ చేశారు.



కుర్ది బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

వరద బాధితులను ఆదుకుంటాం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

కామారెడ్డి టౌన్: వరద బాధితులను ఆదుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్‌లతో కలిసి జిల్లాలోని జాతీయ రహదారి, జీఆర్ కాలనీలను పరిశీలించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానికులకు పండ్లు, పులిహోర ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధరాత్రి క్లౌడ్ బరస్ట్ అవ్వడం వల్ల వరద ఉధృతి పెరిగిందన్నారు. వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, బాధితులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. అప్రమత్తత వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామన్నారు.



జీఆర్ కాలనీలో స్థానికులకు పండ్లు, పులిహోర పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పర్యటన

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. జీఆర్ కాలనీలో బాధితులతో మాట్లాడారు. ఎస్పీ, కలెక్టర్‌లతో మాట్లాడి సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి జీఆర్ కాలనీని పరిశీలించారు.



సిర్‌పూర్ గ్రామస్తులను బోట్‌లో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

కాపాడిన చెట్లు..

- వరదలో కొట్టుకుపోయిన కారు
- ఇద్దరు సురక్షితం.. ఒకరి గల్లంతు



బాల్‌రాజ్ (ఫైల్)

దోమకొండ : వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న కారులోని ఇద్దరు వ్యక్తులను చెట్లు కాపాడాయి. వివరాలిలా ఉన్నాయి. దోమకొండకు చెందిన ఆర్ఎంపీ మ్యాక హరిశంకర్ తన కుమారుడు దేవేందర్‌తో కలిసి బుధవారం రాజంపేటలో మరణించిన అల్లుడి మృతదేహాన్ని చూసేందుకు బయలుదేరారు. లింగుపల్లి వద్ద పోలీసులు బారికేడ్లు అడ్డం పెట్టగా.. సంఘమేశ్వర్ నుంచి పెద్దమల్లారెడ్డి మీదుగా భిక్కనూరు హైవే వైపు కారులో వెళుతున్నారు. సంఘమేశ్వర్‌లో ఎడ్లకట్ట వాగు బ్రిడ్జిపై నుంచి రోడ్డుకు ఇరువైపులా పారుతోంది. వాగును దాటే క్రమంలో కారు నీటిలో చిక్కుకుంది. అదే సమయంలో బైక్‌పై అటుగా వెళుతున్న సంఘమేశ్వర్‌కు చెందిన గోత్రాల బాల్‌రాజ్ నీటిలో కొట్టుకుపోతూ కారును పట్టుకున్నాడు. గమనించిన గ్రామస్తులు వీరిని కాపాడేందుకు అటుగా వెళుతున్న పొక్లెయిన్‌తో ప్రయత్నించారు. కానీ నీటి ఉధృతికి కారుతో సహా ముగ్గురు కొట్టుకుపోయారు. గ్రామశివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో చెట్లను తట్టుకొని కారు ఆగిపోగా హరిశంకర్, దేవేందర్ కారుపైకి ఎక్కి చెట్లను పట్టుకున్నారు. సాయంత్రం వరద తగ్గుముఖం పట్టడంతో పొలాల గుండా కొంతదూరం వచ్చారు. రైతులు గమనించి ఇద్దరినీ ఒడ్డుకు చేర్చారు. రాత్రి సంఘమేశ్వర్‌లోనే ఉండి గురువారం దోమకొండకు చేరారు. కాగా గల్లంతైన గోత్రాల బాల్‌రాజ్ ఆచూకీ తెలియలేదు. బాల్‌రాజ్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య రూప, ఇద్దరు కుమారులు ఉన్నారు.



తండ్రీకొడుకులను కాపాడిన గ్రామస్తులు



భారీ వర్షంతో కామారెడ్డిలో దెబ్బతిన్న జాతీయ రహదారి



కామారెడ్డి శివారులో నీట మునిగిన పాత జాతీయ రహదారి ప్రాంతం



భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో హైవేపై ప్రవహిస్తున్న నీరు



సంఘమేశ్వర్ శివారులో వాగు ఉధృతితో మృతిచెందిన ఆవులు



బీబీపేట పెద్దచెరువు వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



సిరిసిల్ల రోడ్డులో వరదల్లో చిక్కుకున్న ఇంటి నుంచి కుటుంబాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రెస్క్యూ టీం

క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్
- వర్ష ప్రభావిత తీరును ఫోన్‌లో రాష్ట్ర మంత్రికి వివరించిన అధికారులు



కామారెడ్డి టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ తెలిపారు. గురువారం ఆయన టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌తో కలిసి వర్ష ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రామాలు, మండల కేంద్రాలలో మెరుగైన వైద్యం కోసం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తామన్నారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ, సత్య గార్డెన్‌లోని పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. దేవునిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి మందుల కొరత, ఇతర మౌలిక వసతులకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ..వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహతో ఫోన్‌లో మాట్లాడారు. వారి వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జలదిగ్బంధంలో రాజంపేట



రాజంపేట: భారీ వర్షానికి రాజంపేట మండలం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎల్లాపూర్, పలుగుట్ట, గుడితండా, శేర్‌శంకర్ తండాల చుట్టూ వాగులు పొంగిపొర్లాయి. దీంతో తండాలకు విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం చోటుచేసుకుంది. వరద ఉధృతికి పదుల సంఖ్యలో పశువులు నీటిలో కొట్టుకుపోయినట్లు తండావాసులు పేర్కొన్నారు. రాజంపేట, కొండాపూర్ తదితర గ్రామాలలో చెరువులకు గండి పడటంతో అప్రమత్తమైన ప్రజలు గండ్లను పూడ్చి అలుగుల వైపు నీటిని మళ్లించారు. కొండాపూర్, అన్నారం గ్రామాల పరిధిలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిల వద్ద మట్టికొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచాయి. రాజంపేట, బస్వన్నపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దాయిపల్లి గేటు వద్ద ప్రధాన రోడ్డు కోతకు గురైంది. వరద ధాటికి వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పురాతన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలను సంబంధిత పంచాయతీ సిబ్బంది పునరావాస కేంద్రాలకు తరలించారు.

ఐర్లాండ్‌లో గుండెపోటుతో మెండోరా వాసి మృతి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన సామ అన్వేష్‌రెడ్డి(30) ఐర్లాండ్‌లో గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. అక్కడ విధుల్లో ఉండగానే గుండెపోటు రావడంతో తోటివారు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు తెలిపారు. 4 నెలల క్రితమే సెలవుపై వచ్చిన అన్వేష్‌రెడ్డి తన మేన మరదలును వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం మళ్లీ ఇటీవల ఐర్లాండ్ వెళ్లాడు. పండుగ పూట అతడి మరణ వార్త వినడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటుతున్నాయి.



సిరిసిల్లరోడ్డులో వరదకు కొట్టుకుపోతున్న వృద్ధుడు (స్థానికులు కాపాడారు)



ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్



జీఆర్ కాలనీలో వరద నీరు వెళ్లాక ఇంటి దుస్థితి

కామారెడ్డి పురం.. అల్లకల్లోలం

- బీభత్సం సృష్టించిన భారీ వర్షం
- చెరువు వరద ప్రవాహంలో గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిగా మునిగిన జీఆర్ కాలనీ
- వరదల్లో చిక్కుకుని భయంతో గడిపిన కాలనీవాసులు
- సురక్షితంగా కాలనీవాసులను కాపాడిన పోలీసులు, రెస్క్యూ టీం
- వరదల్లో సర్వం కోల్పోయి.. తీవ్రంగా నష్టపోయిన బాధితులు



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



సిరిసిల్లరోడ్డులో వరదలకు కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టిన వాహనాలు

కామారెడ్డి టౌన్: మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కురిసిన భారీ వర్షం కామారెడ్డి జిల్లా కేంద్రంలో అల్లకల్లోలం సృష్టించింది. పట్టణమంతా జలమయం అయింది. లోతట్టు ప్రాంత కాలనీలన్నీ మునిగిపోయాయి. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పరిధిలో గోస్కిరాజయ్య(జీఆర్) కాలనీ కామారెడ్డి పెద్ద చెరువు వరద కాలువ పక్కనే ఉంది. మంగళవారం అర్ధ రాత్రి ఒక్కసారిగా వరద నీరు ప్రవాహం పెరిగిపోవడంతో 15 నిమిషాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. స్థానికులు తేరుకునే లోపే గ్రౌండ్ ఫ్లోర్‌లో పూర్తిగా నీరు చేరడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కొందరు బయటకు పరుగులు తీశారు. మరికొందరు మొదటి అంతస్తులోకి పరుగులు తీశారు. సహాయం కోసం కేకలు వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూటీం, మున్సిపల్, జిల్లా యంత్రాంగం జీఆర్ కాలనీకి చేరుకుని స్థానికులను వరదల్లో నుంచి రాత్రంతా శ్రమించి కాపాడారు. కొందరిని పక్కనే ఉన్న సత్య గార్డెన్‌కు తరలించగా, మరికొందరు వారి బంధువుల ఇళ్లకు వెళ్లారు.

చెరువు నుంచి ఉధృతి పెరగడంతో జాతీయ రహదారిపై ఉన్న 15 కార్లు, ద్విచక్రవాహనాలు కొట్టుకునిపోయాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. వరద దెబ్బకు ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, వాహనాలు చెడిపోవడంతో పాటు, ఇళ్లలోని సామగ్రి తడిసిముద్దయ్యాయి. గురువారం ఉదయం ఇండ్ల దుస్థితి చూసుకున్న జీఆర్ కాలనీ వాసులు కన్నీరుమున్నీరయ్యారు. పలు ఇండ్లలో పాములు, విష పురుగులు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు సిరిసిల్లా బైపాస్ రోడ్డు పైన భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆ రాత్రి డిచ్‌పల్లి నుంచి పాతరాజంపేట వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తూ చర్యలు చేపట్టారు. కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు, అలాగే హైదరాబాద్‌కు పూర్తిగా రాకపోకలు నిలిచాయి. మంగళవారం రాత్రి నుంచి గురువారం వరకు ఆర్టీసీ బస్సుల రవాణాను నిలిపివేశారు.



వరదలో కొట్టుకొచ్చిన ఆటో



జీఆర్ కాలనీలోని ఓ స్కూల్‌లో వరద తర్వాత పరిస్థితి

ఎందుకీ వైపరీత్యం?

- కబ్జాలతో ఉనికి కోల్పోయిన పెద్దచెరువు వాగు
- అలుగు దూకితే నీటమునుగుతున్న కాలనీలు
- చిగురుటాకులా వణుకుతున్న జిల్లా కేంద్రం



జీఆర్ కాలనీలోని ఓ సెల్లార్‌లో నిలిచిన నీరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణం వర్షాకాలం వచ్చిందంటే చాలు వణికిపోతోంది. వరద ఎక్కడి నుంచి తమ ఇళ్లల్లోకి దూసుకువస్తుందో తెలియని పరిస్థితుల్లో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద వర్షం కురిస్తే చాలు లోతట్టు ప్రాంతాలే కాదు అభివృద్ధి చెందిన కాలనీలూ నీట మునుగుతున్నాయి. ముఖ్యంగా విద్యానగర్, కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీల్లో వరద నీరు చాలా చోట్ల ఇళ్లల్లోకి వచ్చి చేరుతోంది. ఇక చెరువు అలుగు పారినపుడల్లా జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలు మునిగిపోతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీనికి కారణం ఏమిటన్న అంశంపై పట్టణంలో చర్చ నడుస్తోంది.

ఆ చెరువుది 128 ఏళ్ల చరిత్ర....

1897లో అప్పటి ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ కామారెడ్డి పెద్ద చెరువును నిర్మించాడని చరిత్ర చెబుతోంది. పట్టణ పరిధిలోని వ్యవసాయ భూములకే కాక, ఇరుగు పొరుగు గ్రామాలైన సరంపల్లి, నర్సన్నపల్లి, క్యాసంపల్లి తదితర గ్రామాలకు చెందిన 9 వందల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడంతో పాటు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు దీనిని నిర్మించారు. దీని పొడవు 1.8 కిలోమీటర్లు. చెరువు ఎగువన లింగాపూర్ చెరువు ఉంటుంది. తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి, లింగాపూర్ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు కామారెడ్డి చెరువును చేరుతుంది. కాగా కామారెడ్డి పట్టణం విస్తరించడంతో చెరువు నీటిని పంటలకు వదలకుండా తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. చెరువులో నీరుంటే సగం పట్టణంలో భూగర్భ జలాలకు ఇబ్బంది ఉండదు. బీఆర్ఎస్ పాలనలో చెరువుకు మరమ్మతులు జరిపి మినీ ట్యాంకుబండ్‌గా కొంత మేర అభివృద్ధి చేశారు.

కబ్జాకు గురై కుచించుకుపోయిన వాగు

పెద్ద చెరువు అలుగు పోసినపుడు నీరంతా వాగు ద్వారా ప్రవహించేది. అయితే వాగు చాలా వరకు కబ్జాకు గురైంది. చెరువు దిగువన వాగుకు ఒక వైపు హౌజింగ్ బోర్డు కాలనీ మరోవైపు జీఆర్ కాలనీ, సరంపల్లి ఉన్నాయి. రెండు వైపులా కబ్జాలు జరిగాయి. దీంతో వాగు విస్తీర్ణం కుచించుకుపోయింది. వాగు ప్రవాహం వేగంగా ఉన్నపుడు విస్తీర్ణం సరిపోకపోవడంతో నీరంతా ఇరువైపులా ప్రవహించి ఇళ్లల్లోకి చేరుతోంది. వరద ప్రవాహం సరిగా లేకపోవడంతో పాత జాతీయ రహదారి (ఎన్‌హెచ్-7)పై ఉన్న వంతెనలు దెబ్బతింటున్నాయి. దిగువ భాగంలో కూడా వాగు చాలా వరకు కబ్జాకు గురైంది.

నాలాలు మాయం...

ఎగువభాగం నుంచి వచ్చే వర్షపు నీరు పారడానికి ఉన్న నాలాలు చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్ కాలనీ, దేవునిపల్లి, నిజాంసాగర్ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా కామారెడ్డి పెద్దచెరువులోకి వెళ్లే నాలాలు చాలా వరకు ఉనికే లేకుండాపోయాయి. దీంతో వర్షం కురిసినపుడల్లా ఆయా కాలనీల్లో నీరు రోడ్లమీద నిలిచిపోయి ఇళ్లను ముంచేస్తోంది. అశోక్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. నాలాలు కనుమరుగయ్యాయి. పట్టణంలో పలు కుంటలు కనుమరుగై కాలనీలుగా మారాయి. దీంతో వర్షపు నీరంతా ఎక్కడికక్కడే నిలిచిపోయి నీరు ఇళ్లను ముంచెత్తుతోంది. పట్టణంలోని సాయిబాబా ఆలయం ఏటా నీట మునుగుతోంది. స్టేషన్ రోడ్డు, సిరిసిల్ల రోడ్లలో ఉన్న నాళాలు, కాలువలు అడ్రస్ గల్లంతై వర్షపు నీరు రోడ్లను ముంచెత్తుతోంది.

మనకు కావాలి హైడ్రా...

జిల్లా కేంద్రంలో ఆక్రమణలకు గురైన వాగులు, కుంటలు, నాళాలను దారికి తేవడానికి హైడ్రా లాంటి వ్యవస్థ అవసరం అన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ వాగులు, కాలువలను పూడ్చి ప్లాట్లుగా మార్చి అమ్ముకోవడం కొందరికి అలవాటుగా మారింది. వారికి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు అండగా నిలవడంతో అధికారులు అటువైపు చూడడం లేదు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోచారం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు



కోతకు గురైన ప్రాజెక్టు కట్ట ప్రాంతం

- పోటెత్తిన వరద.. కోతకు గురైన కట్ట
- ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

నాగిరెడ్డిపేట: భారీవర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టుకు పెనుముప్పు ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు ప్రధాన అలుగుపై నుంచి దిగువకు నీరు ప్రవహించింది. నీటిప్రవాహ తాకిడికి అలుగుకు ఒకవైపు మట్టి కొట్టుకుపోయి కట్ట కోతకు గురైంది. సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చిన క్రమంలో ప్రాజెక్టు అలుగు ఎక్కడ తెగిపోతుందోనని అటు అధికారులతో పాటు ఇటు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు.

ఇదే అత్యధికం..

పోచారం ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో వచ్చింది. గతంలో గరిష్టంగా 70 వేల క్యూసెక్కుల వరకు మాత్రమే వరద నీరు వచ్చింది. బుధవారం 1.82 లక్షల ఇన్‌ఫ్లో రావడంతో ఆందోళన నెలకొంది. పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి వరదనీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ముప్పు తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.కోతకు గురైన ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు ట్రాక్టర్లతో మట్టిని పోయించి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, నాగిరెడ్డిపేట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పర్యవేక్షించారు.

పాలీ్థ్రాంలో చిక్కుకున్న కార్మిక కుటుంబం



ఎల్లారెడ్డి: పౌల్ట్రీ ఫాంలో పని చేసి అలసిపోయి నిశ్చింతగా రాత్రి పడుకున్న కుటుంబానికి వేకువ జామున తడి తగలడంతో ఒక్కసారి భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టూ వరద నీరు చేరడంతో ఏమి చేయాలో తోచక బిక్కుబిక్కుమంటూ సాయం కోసం ఎదురు చూశారు. వివరాలు.. తిమ్మారెడ్డి గ్రామ శివారు పౌల్ట్రీ ఫాంలో బాలరాజు, సంగీత కుటుంబం తన కూతురు కల్యాణితో కలిసి పని చేస్తూ జీవనం గడుపుతున్నారు. మంగళవారం రాత్రి పౌల్ట్రీ ఫాంలో పని చేసి నిద్రించిన కుటుంబానికి బుధవారం వేకువజామున నిద్రించే చోట నీటి శబ్దం రావడంతో పాటు తడి తగిలింది. ఫాంలోకి వరద నీరు వచ్చిందని గమనించి బాలరాజు తన భార్య సంగీత, కూతురు కల్యాణిని తీసుకుని పౌల్ట్రీ ఫాం రేకుల షెడ్డుపైకి ఎక్కి కూర్చున్నాడు. అంతకంతకు వరద నీరు పెరగడంతో పాటు కూర్చున్న రేకు గాలికి ఎగిరిపోతుండటంతో మరింత ఆందోళన చెందాడు. అటుగా వెళ్తున్న రైతులు వారిని గమనించి స్థానిక అధికారులు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు సమాచారం అందించడంతో ఆయన.. కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్రతో మాట్లాడి తక్షణం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. అంతలోనే ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, ఫైర్ ఆఫీసర్ వినోద్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలరాజు కుటుంబం దగ్గరికి తాడు సహాయంతో చేరుకుని షెడ్డుపై నుంచి వారిని కిందికి దించేందుకు ప్రయత్నించారు. బాలరాజు కుటుంబీకులు తాడు సహాయంతో కిందకు దిగేందుకు భయపడ్డారు. దీంతో సీఐ, ఫైర్ ఆఫీసర్లు వెనుదిరిగి వచ్చారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మధ్యాహ్నం 3 గంటల సమయానికి బోటు సహాయంతో చేరుకుని సురక్షితంగా తీసుకుని వచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై షబ్బీర్ అలీ, సురేశ్ షెట్కార్, మదన్‌మోహన్‌రావు

సహాయక చర్యలు భేష్..

కామారెడ్డిటౌన్: అధికారులు సమన్వయంతో పనిచేసి క్లౌడ్ బరస్ట్ కారణంగా ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఏర్పడిన భయంకర వరద పరిస్థితులను ఎదుర్కొని ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించగలిగారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జిల్లాలో వరద పరిస్థితులపై మంత్రి సీతక్క ఎస్పీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక చర్యలను అభినందించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి స్వయంగా రివ్యూ చేయలేకపోయారన్నారు. రోడ్లు, చెరువుల కట్టలు దెబ్బతిన్న ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు చేపట్టాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ప్రజలకు తెలియజేయాలని, ప్రమాదకర రహదారులపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో శానిటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఫైర్ అదనపు డీజీ నాగిరెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలించక..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలో వర్ష బీభత్సాన్ని పరిశీలించడానికి గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి రావాల్సి ఉంది. ఆయన పెద్దపల్లినుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్ద ల్యాండ్ కావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో దిగలేకపోయారని మంత్రి సీతక్క తెలిపారు. దీంతో సీఎం హెలికాప్టర్‌లో మెదక్‌కు వెళ్లారన్నారు.

బిహారీ కార్మికులను కాపాడిన సిబ్బంది



గున్కుల్‌లో పాల్ట్రీఫాంలో చిక్కుకున్న కుటుంబాన్ని కాపాడిన రెస్క్యూటీం

నిజాంసాగర్: రికార్డు స్థాయిలో కురిసిన వర్షానికి వరద నీరు పోటెత్తడంతో బిహార్ వలస కార్మికులతో పాటు, పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్న కార్మికుల కుటుంబీకులను ఎస్డీఆర్ఎఫ్, రెస్క్యూ టీం బృందాలు సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. వివరాలు.. మహ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ శివారులోని మంజీరానది ఉగ్రరూపం దాల్చడంతో పౌల్ట్రీ ఫామను ముంచేసింది. పౌల్ట్రీ ఫాంలో కూలీ పనులు చేస్తున్న ఉట్టి శంకర్, గంగామణి దంపతులతో పాటు అఖిల, కృష్ణ చిన్నారులను ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో పౌల్ట్రీ ఫాం ఎక్కారు. 9 గంటల పాటు వారు పౌల్ట్రీ ఫాంలో వర్షానికి తడుస్తు రక్షణ కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాలను రప్పించి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. అలాగే గున్కుల్ శివారులో చిక్కుకున్న బేగరి భానుప్రసాద్‌ను సైతం ఒడ్డుకు చేర్చారు.

ట్యాంకర్‌పై ఆరుగురు సురక్షితం..

కల్యాణి వాగు వరద ఉధృతి కారణంగా బొగ్గుగుడిసె వద్ద చౌరస్తా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న బిహార్ కార్మికులు వరద నీటిలో చిక్కుకున్నారు. వరద నీరు ట్యాంకర్‌ను ముంచెత్తడంతో కార్మికులు కొట్టుకు పోయే స్థితికి చేరుకున్న సమయంలో ఎస్డీఆర్ఎఫ్ టీం కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్పింది.

ఓ కుటుంబాన్ని సొంతూరికి చేర్చిన 'గంప'



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలో ఉంటున్న సడుగు నర్సింలు కుటుంబం వరదల్లో చిక్కుకోగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వారిని తన వాహనంలో ఎక్కించి నర్సింలు సొంతూరు సంగమేశ్వర్ గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా నర్సింలు కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారం-వజ్జపల్లి గ్రామాల శివారులో ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందారు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దగ్గి గ్రామానికి చెందిన దేగులవాడి యేసప్ప(56)ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన ఆటోలో ప్రయాణికులను తీసుకొని యాచారంలో దింపి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. యాచారం-వజ్జపల్లి గ్రామాల శివారులో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో యేసప్ప ఆటో కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను గమనించకపోవడంతో ఆటో బోల్తా కొట్టి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జల్లాపల్లి ఫారంలో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంకు చెందిన నేనావత్ రాందాస్ (23) అనే యువకుడు మద్యానికి బానిసై, తరచూ ఇంట్లో ఘర్షణ పడేవాడు. ఈక్రమంలో బుధవారం డబ్బులు కావాలని కుటుంబ సభ్యులతో గొడవపడి అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సింధు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కిష్టవ్వ(65) ఈ నెల 25న తన మనుమళ్లను తిట్టింది. దీంతో ఆమె కుమారుడు నర్సింలు ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది అదేరోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా గురువారం గ్రామశివారులోని పోచారం ప్రధాన కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. ఇంటి వద్ద జరిగిన గొడవ కారణంగా తన తల్లి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు తెలిపాడు. ఈమేరకు అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరదలో చిక్కుకొని రైతు మృతి



రాజిరెడ్డి (ఫైల్)

బీబీపేట: భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదల్లో మండలంలోని జనగామకు చెందిన ఓ రైతు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జనగామకు చెందిన కప్పెర రాజిరెడ్డి (63) వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించేవాడు. సాగు పనుల నిమిత్తం బుధవారం పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి పొలం పక్కకే ఎడ్ల కట్ట వాగు ప్రవహిస్తుండడం, బీబీపేట పెద్దచెరువు పూర్తిగా నిండి బ్యాక్ వాటర్ పొలంలోకి చేరడంతో అందులో గల్లంతయ్యాడు. దీంతో గ్రామస్తులు ఎంత వెతికినా అతడి ఆచూకి లభించకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు గురువారం ఉదయం గాలింపు చేపట్టగా రాజిరెడ్డి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రహరీ కూలి యువ డాక్టర్ మృతి



వినయ్ (ఫైల్)

రాజంపేట: వరద నీటిని మళ్లించే ప్రయత్నంలో ప్రహరీ కూలి రాజంపేట మండల కేంద్రంలో యువ డాక్టర్ ఇప్పకాయల వినయ్(28) మృతి చెందాడు. బుధవారం కురిసిన భారీ వర్షంతో బీసీ కాలనీకి సమీపంలో ఉన్న దేవుని చెరువు అలుగుపారింది. చెరువులోకి వచ్చే కట్టు కాలువ ఉధృతి పెరిగి నీరు బీసీ కాలనీ వైపు తిరుగుముఖం పట్టి ఇళ్లలోకి చేరింది. వినయ్ ఇంట్లోకి సైతం నీళ్లు చేరడంతో వాటిని మళ్లించేందుకు గడ్డపార సహాయంతో ప్రహరీని కూల్చేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడ కూలి మీద పడడంతో వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్ గుండారం పల్లె దవాఖానాలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పండుగ పూట డాక్టర్ మరణించడంతో రాజంపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై దత్తాత్రి గౌడ్ తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌ను కాపాడిన జీఎంఆర్ సిబ్బంది



భిక్కనూరు: వరద నీటిలో చిక్కుకున్న ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్‌ను జీఎంఆర్ సిబ్బంది కాపాడారు. భిక్కనూరుకు చెందిన గూదురి సతీశ్ కామారెడ్డి పట్టణంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తాడు. బుధవారం విధులు నిర్వహించేందుకు తన కారులో కామారెడ్డికి వెళుతున్నాడు. జంగంపల్లి గ్రామశివారులో జాతీయ రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించడంతో కారును రోడ్డు పక్కన నిలిపాడు. వరద ఉధృతి పెరగడంతో కారు ముందుకు వెళ్లి రోడ్డు పక్కన ఉన్న గుంతలో దిగబడింది. కారులో ఉన్న సతీశ్ కేకలు వేయడంతో అక్కడ ఉన్నవారు బయటికి రావాలని సూచించారు. దీంతో కారు విండోలో నుంచి బయటకు వస్తుండగా వరద ప్రవాహం పెరిగి సతీశ్ నీట మునిగాడు. అక్కడే ఉన్న జీఎంఆర్ సిబ్బంది వెంటనే నీళ్లలోకి దూకి సతీశ్‌ను ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు. దీంతో పలువురు జీఎంఆర్ సిబ్బందిని అభినందించారు.